సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 1 । జూలై । 2025



పచ్చిరొట్టతో పచ్చధనం

పచ్చిరొట్ట సాగు లాభాలు కురిపిస్తోంది. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు పశుగ్రాసానికి ఆలంబనగా ఉంటోంది. దీని సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.




మత్తులో చెలరేగిపోయారు!

పెద్దాపురం మరిడమ్మ ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా దర్గా సెంటర్ చేపల వీధి సంబరంలో కొందరు యువకులు పరస్పర దాడులకు దిగి, భయంకర వాతావరణం సృష్టించారు.

8లో

డెల్టాలకు 12,150 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి మొత్తం 12,150 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 17,908 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రజా వైద్యానికి వైఎస్ జగన్ పెద్దపీట

- మంత్రి సత్యకుమార్ ఆలోచించి మాట్లాడాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి కిషోర్



అమలాపురం టౌన్: కరోనా కష్ట కాలంలోనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవలను ప్రజల దరిచేర్చారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ గుర్తు చేశారు. అంతలా వైద్య సేవలు అందించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఇప్పుడు మంత్రి సత్యకుమార్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సోమవారం అమలాపురంలో ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజారోగ్య వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని, మంత్రి సత్యకుమార్ ఈ వాస్తవాలను గ్రహించి మాట్లాడితే బాగుంటుందని కిషోర్ సలహా ఇచ్చారు. కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి ఓ రక్షణ కవచంలా ఉండి ప్రతి కరోనా రోగికి ప్రభుత్వ వైద్యం అందేలా కృషి చేశారని గుర్తు చేశారు. కొన్ని వేల కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు- నేడు పథకం ద్వారా సకల సౌకర్యాలు అంటే సీటీ స్కాన్, ఎమ్మారై మెషీన్లు, డయాలసిస్ యూనిట్లు తదితరాలను కల్పించారని స్పష్టం చేశారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆస్పత్రుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ప్రజా వైద్యం పట్ల అంత ప్రేమ ఉంటే నాడు వైఎస్ జగన్ శంకుస్థాపన చేసి మధ్యలో ఆగిపోయిన ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

నేటి నుంచి డెంగీ నివారణ మాసోత్సవాలు



డెంగీ నివారణపై ముద్రించిన బ్యానర్లను ప్రదర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

అమలాపురం టౌన్: జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణలో భాగంగా మంగళవారం నుంచి జాతీయ డెంగ్ మాసోత్సవాలు-2025 నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర వెల్లడించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో డెంగీపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్యానర్లను సోమవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా దుర్గారావు దొర మాట్లాడుతూ డెంగీ, మలేరియా, ఫైలేరియా నివారణకు పలు జాగ్రత్తలు, సూచనలతో వైద్య శాఖ గోడ పత్రికలు, బ్యానర్లు, కరపత్రాలు ముద్రించిందన్నారు. డెంగీ కారణంగా తీవ్రమైన జ్వరం లేదా అంతకంటే ఎక్కువ తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, బలహీనత, అలసట వంటి రుగ్మతలు అనివార్యమవుతాయని ఆయన చెప్పారు. ఇంట్లో పరిసరాల శుభ్రత పాటించి, నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ కాగానే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తగిన చికిత్స పొందాలని సూచించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్రావు, జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఫీజులుం



- విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి యథేచ్ఛగా దోపిడీ
- ఒకటో తరగతికే కనీస ఫీజు రూ.25 వేలు
- బస్సుకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు
- యూనిఫామ్, నోట్ బుక్స్‌కు అదనపు భారం

సాక్షి, అమలాపురం: 'కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లిన రోగి విషయంలో వైద్యులు చెప్పిందే వేదం.. చేయించిందే పరీక్షలు.. కట్టమన్నదే ఫీజు.. మారు మాట్లాడకుండా అన్నీ వినాల్సిందే. ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లలోనూ అదే జరుగుతోంది. వారు చెప్పినంతే ఫీజు.. పుస్తకాలకు, యూనిఫామ్ వంటి వాటికి ఎంతంటే అంతే.. నోరు మెదపకుండా చెల్లించాల్సిందే' అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనతో అంటున్న మాటలు ఇవి. ప్రస్తుతం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు విద్యార్థులకు పెనుభారంగా మారాయి. వేలకు వేలు ఫీజులకు తోడు యూనిఫామ్, టై, బెల్టు, బూట్లు, పాఠ్య, రాత పుస్తకాలు.. ఇలా అన్నీ తాము చెప్పిన చోటే తాము చెప్పిన ధరకే కొనాలంటూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విధిస్తున్న ఆంక్షలు తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విద్యా విధానంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చెలరేగిపోతున్నాయి.

జిల్లాలో మొత్తం 454 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిపై విద్యాశాఖ నియంత్రణ రానురాను తగ్గిపోతోంది. ప్రభుత్వ పెద్దల నుంచి వస్తున్న ఒత్తిడి జిల్లా స్థాయిలో విద్యాశాఖ అధికారుల చేతులు కట్టేస్తున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో అసలు ఏం జరుగుతుందో కనీసం అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదునుగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలను బేఖాతరు చేస్తున్నా కనీసం అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. ఒకటో తరగతి ఫీజు రూ.25 వేల పైనే.. కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో అయితే రూ.50 వేల కూడా ఉంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఫీజులు పెరుగుదల 30 శాతం దాటిందని అంచనా. ఇది మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. దీనికితోడు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌కు అదనం. బస్సు ఫీజులు అయితే మరింత భారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కిలోమీటరుకు విద్యార్థుల నుంచి బస్సు ఫీజు రూ.1.30 మాత్రమే వసూలు చేయాలి. అయితే ఏడాదికి బస్సుకు రూ.10 వేలు మొదలు రూ.15 వేల వరకూ వసూలు చేస్తుండడం గమనార్హం. దీంతో ఒకటో తరగతి విద్యార్థికే మొత్తం అన్నీ కలిపి రూ.40 వేల నుంచి రూ.65 వేల వరకూ ఖర్చు అవుతోంది.

పర్యవేక్షణ కమిటీలు ఎక్కడో?

ప్రైవేట్ పాఠశాలలపై ఉన్న నిబంధనల అమలుకు కనీసం కమిటీలు ఎక్కడా కనిపించడం లేదు. త్రీ మెన్ కమిటీ రూపంలో మండల విద్యాశాఖ అధికారి, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఒక క్లస్టర్ స్కూల్ హెడ్మాస్టర్లతో ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉండగా, అవి అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. మానసికంగా, శారీరకంగా విద్యార్థులు ఉండాలంటే అందుకు తగ్గ వాతావరణం కల్పించాలి. వ్యాయామ ఉపాధ్యాయుల నియామకంతోపాటు ఆట స్థలం కూడా ఉండాలి. కానీ అటువంటి పరిస్థితులు ఏమీ కానరావు. బహుళ అంతస్తుల భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నా అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వాస్తవ రూపంలో అవి అమలుకు నోచుకోవడం లేదు. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నా, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా పరిశీలిస్తామని చెప్పడం తప్ప అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలి. అలాగే ఫీజులు కూడా వసూలు చేయాలి. విద్యా శాఖ కూడా ఫీజుల వసూలుపై నిఘా పెట్టింది. ఆయా పాఠశాలలను సందర్శించడం ద్వారా అధిక ఫీజులు తీసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ షేక్ సలీం బాషా,
డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

గత ప్రభుత్వంలో నిరంతర నిఘా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్, **కార్పొరేట్ పా**ఠశాలలపై నిరంతరం నిఘా కొనసా**గేది. ఫీజులకు** సంబంధించి అధికారులు తనిఖీలు **నిర్వహించే వా**రు. దీంతో యాజమాన్యాలు వెన**కాడే పరిస్థితి** ఉండేది. 2020 విద్యా విధానం **ప్రకారం గత** ప్రభుత్వం రాష్ట్రంలో పాఠశాల **విద్యకు సం**బంధించి మూడు రకాల ఫీజులు **ప్రకటించింది**. ఈ ఫీజులన్నీ కూడా 2023–24 **విద్యా సంవత్**సరం వరకూ అమలులో ఉన్నాయి. **దాని ప్రకారం** నర్సరీ మొదలు పదో తరగతి వరకూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అయితే రూ.10 వేల మొదలు రూ.12 వేల వరకూ వసూలు చేయాల్సి ఉంటుంది. ఇక మున్సిపాలిటీల్లో రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకూ, కార్పొరేషన్ ప్రాంతాల్లో రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకూ వసూలు చేయాలని పేర్కొన్నారు. ఈ విధానాన్ని 'కూటమి' కొనసాగించకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం నర్సరీ విద్యార్థికే రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకూ ఫీజులు వేస్తున్నారు. ఇవి కాకుండా యూనిఫాం పాఠశాలలలో, లేదా యాజమాన్యం సూచించిన షాపులో కొనుగోలు చేయాలనే ఆంక్షలతో పాటు, టై, బెల్టులు పాఠశాలలోనే కొనుగోలు చేయాలని అంటున్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు మాత్రమే వినియోగించాలని నిబంధన ఉన్నా అది అమలు కావడం లేదు. ప్రత్యేకంగా మెటీరియల్ రూపొందించి వాటిని విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై అధికారులు తమ దృష్టికి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప, తాము ఎన్ని పాఠశాలలు తనిఖీ చేసింది.. ఏ ఏ పాఠశాలల్లో ఎటువంటి లోపాలు ఉన్నాయి.. వాటి నియంత్రణకు యాజమాన్యాలకు చేసిన సూచనలు ఏమైనా ఉన్నాయా అనేది మాత్రం ప్రకటించలేక పోతుండడం గమనార్హం.

ఫీజులు తగ్గించపోతే ఉద్యమం



ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ప్రతి స్కూల్ వద్ద నియమ నిబంధనలతో నోటీసు బోర్డు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. ఫీజులు తగ్గించకపోతే ఉద్యమం చేస్తాం. అధిక ఫీజులు దోపిడీ చేస్తున్న విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న విద్యా శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

–రేవు తిరుపతిరావు,
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వినియోగదారుల హక్కులను రక్షించాలి

అమలాపురం రూరల్: కొత్తగా ఏర్పడిన జిల్లా వినియోగదారుల రక్షణ మండలి వినియోగదారుల హక్కులను రక్షించడానికి తోడ్పడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి సూచించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తర్వాత కొత్తగా మండలిని ఏర్పాటు చేశామన్నారు. వస్తువులు, సేవల నాణ్యత సామర్థ్యం, స్వచ్ఛత తెలుసుకునే హక్కుతో పాటు వ్యాపారంలో అనుచిత పద్ధతుల బారిన పడకుండా వినియోగదారులను కాపాడాల్సిన బాధ్యత కమిటీకి ఉందన్నారు. చౌక ధరల దుకాణాలు, పెట్రోల్ బంకులు, ఎల్పీజీ ఏజెన్సీలు, ఆరోగ్య సంరక్షణ రంగంలోని ఆసుపత్రులు, డయాగ్నోసిస్ సెంటర్ల దోపిడీలను అరికట్టి పారదర్శకమైన సేవలు అందించడానికి మండలి పని చేస్తుందన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఈ రక్షణ మండలి సభ్యులు వినియోగదారులకు న్యాయబద్ధమైన సేవలను అందించాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్, వినియోగదారుల ఫోరం సభ్యులు అరిగెల బలరామ్మూర్తి, ఆదిత్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవునికి జన్మనక్షత్ర పూజలు

అన్నవరం: జన్మ నక్షత్రం మఖను పురస్కరించుకుని సత్యదేవునితో పాటు అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరచి అర్చకులు సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల మూలవిరాట్టులకు, శివలింగానికి మహన్యాస పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించి, సుగంధభరిత పుష్పాలతో పూజించారు. ఉదయం ఆరు గంటల నుంచి దర్శనానికి భక్తులను అనుమతించారు. యాగశాలలో ఉదయం 9 గంటల నుంచి సత్యదేవుడు, అమ్మవారికి ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని సుమారు 20 వేల మంది భక్తులు దర్శించారు. వెయ్యి వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుడు, అమ్మవారు, శంకరులను ముత్యాల కవచాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

రేపు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ సమావేశం



సమావేశంపై సూచనలు ఇస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి పిలుపు

అమలాపురం రూరల్: 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 2వ తేదీ సాయంత్రం 3 గంటలకు నిర్వహించే సమావేశ వేదికైన అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి ఎ-కన్వెన్షన్ హాలును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డితో పాటు పార్టీ నేతల బృందం సోమవారం పరిశీలించింది. ఆ రోజు కార్యక్రమానికి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరు కావడమే కాకుండా 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'ని ప్రారంభిస్తారని జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి తెలిపారు. ఆ రోజు జరిగే జిల్లా స్థాయి పార్టీ సమావేశానికి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశ వేదికైన ఎ- కన్వెన్షన్ ఫంక్షన్ హాలును జగ్గిరెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, పార్టీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, రూరల్ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, సెంట్రల్ డెల్టా బోర్డు మాజీ చైర్మన్ కుడుపూడి బాబు, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, కొల్లాటి దుర్గాబాయి, నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, దూడల ఫణి, కల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించండి: కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ మహేష్‌కుమార్



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వస్తున్న ప్రతి అర్జీని సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్ గోదావరి భవన్ వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సుమారు 250 అర్జీలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, ఎస్‌డీఎస్ కృష్ణమూర్తి, డీఎల్‌డీఓ రవీంద్ర స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని సంబంధిత జిల్లా అధికారులకు అందించి, నిర్దేశిత గడువు లోగా పరిష్కరించేలా చూస్తున్నామన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతా పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు, రెవెన్యూ అంశాలపై అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ ఎస్.కార్తీక్, డీపీఓ శాంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఈలు కృష్ణారెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర, డీఎస్ఓ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 32 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు 32 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు తమ సమస్యలపై ఫిర్యాదు పత్రాలు అందించారు. అర్జీదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారితో కొద్దిసేపు మాట్లాడి సమస్య పరిష్కారానికి ఎస్పీ చొరవ చూపారు. అదృశ్యమైన తన తమ్ముడి ఆచూకీ తెలపాలని, రెండు నెలల కిందట అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ న్యాయం జరగలేదని ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సుంకర సత్యనారాయణ జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి కొద్దిసేపు నేలపైనే బైఠాయించాడు. తనకు న్యాయం చేయాలని అభ్యర్థించాడు. పోలీసులు తక్షణమే అతడిని అక్కడి నుంచి లేవదీసి ఏమైనా సమస్య ఉన్నా, ఫిర్యాదు ఉన్నా నేరుగా ఎస్పీ వద్దకు వెళ్లి చెప్పాలని సూచించారు. దీంతో బాధితుడు సత్యనారాయణ జిల్లా ఎస్పీని కలసి తన సమస్యపై ఏకరవు పెట్టాడు. తన చిన్నాన్న కొడుకు సుంకర ఈశ్వరరావు 15 ఏళ్లుగా అమలాపురం దుడ్డివారి అగ్రహారంలో ఉంటున్నాడని, కొబ్బరి ఒలుపు పనిచేసుకుంటూ జీవించే తన తమ్ముడు గత మార్చి 14 నుంచి పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నాడు. ఈ అదృశ్యం కేసును త్వరితగతిన విచారించి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు.

మాజీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి

అమలాపురానికి చెందిన మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ (టీడీపీ)పై, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన తోలేటి ఓం ప్రకాష్ ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. బాకీ నిమిత్తం తనను వేధిస్తున్నాడని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు జీఎస్టీ మినహాయించాలి



జీఎస్టీ అదనపు చీఫ్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న స్టాలిన్‌బాబు

అంబాజీపేట: కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని సామాజిక వేత్త, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు సెంట్రల్ జీఎస్టీ అదనపు చీఫ్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్ కాకర్లను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐఆర్ఎస్ అధికారి ప్రశాంత్ కుమార్ ఇటీవల ఈ పదవిలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్టాలిన్‌బాబు ఆయనకు విశాఖపట్నంలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోనసీమ సుభిక్షమైన వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఎంతో ఖ్యాతి గాంచిందని, ఇటీవల కోనసీమ తలసరి ఆదాయం గణనీయంగా పడిపోయిందని, అనంతపురం కంటే తక్కువగా ఉందంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారని వివరించారు. జీఎస్టీ మినహాయింపులు ఇవ్వడం ద్వారా తలసరి ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఆయనకు వివరించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారని స్టాలిన్ బాబు తెలియజేశారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవల ధరలు ప్రదర్శించాలి



డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రైవేటు ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవల ధరలను 15 రోజుల్లోగా ప్రదర్శించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. రిసెప్షన్ కౌంటర్లో స్థానిక భాష, ఇంగ్లిషులో ఈ ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఏటా జూన్ ఒకటో తేదీ నాటికి ధరల జాబితాను రిజిస్ట్రేషన్ అధికారికి పంపించాలన్నారు. వైద్యం ప్రారంభించే సమయంలోనే రోగి లేదా వారి బంధువులకు సేవల వివరాలు, ధరలను స్పష్టంగా వివరించాలన్నారు. ఈ సూచనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రా అరుణాచలంలో.. ఆధ్యాత్మిక శోభ

- 7న 63 మంది నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ
- ఇతర దేవతా విగ్రహాలు కూడా..
- తరలిరానున్న ప్రముఖులు



శ్రీ అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయం



ఆంధ్రా అరుణాచలంలో ప్రతిష్ఠించనున్న 63 మంది నాయనార్ల విగ్రహాలు

నాయనార్లు ఎవరంటే..

తమిళనాడులో 5 – 10 శతాబ్దాల మధ్య నివసించిన గొప్ప శివ భక్తులే ఈ నాయనార్లు. 13వ శతాబ్దంలో రచించిన తమిళ ప్రబంధం పెరియ పురాణం ప్రకారం వీరు మొత్తం 63 మంది. వీరు భక్తి ద్వారా మోక్షసిద్ధి పొందినట్లు ఈ పురాణం ద్వారా తెలుస్తోంది. నాయనార్లలో రాజుల నుంచి సాధారణ మానవుల వరకూ అన్ని స్థాయిల వారూ ఉన్నారు. భగవంతుడిని చేరడానికి నిష్కల్మషమైన భక్తి తప్ప ఇంకేదీ అవసరం లేదని వీరి కథలు నిరూపిస్తాయి.

ప్రత్తిపాడు రూరల్: తమిళనాడులోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం అరుణాచలాన్ని తలపించేలా.. ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని శ్రీ రమణ సేవాశ్రమం సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటోంది. ఈ ఆధ్యాత్మిక కేంద్రం మూడు దశాబ్దాలుగా అనేక మందిని భగవాన్ రమణ మహర్షి బోధించిన మార్గంలో పయనింపజేస్తూ.. సంఘహిత కార్యక్రమాలు చేపడుతూ.. ఇటు భక్తుల, అటు ప్రజల ఆదరణను చూరగొంటోంది. రాచపల్లికి చెందిన కవల బ్రహ్మచారులు రమణానంద, లక్ష్మణానందలు ఆధ్యాత్మిక సాధనలో రమణ మహర్షి బోధనల పట్ల ఆకర్షితులయ్యారు. వీటి ద్వారా సమాజాభివృద్ధికి దోహదపడాలనే కాంక్షతో 1990 ఆగస్టు 15న 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకొని రాచపల్లి సమీపాన ప్రజల విరాళాలతో నాలుగెకరాల స్థలాన్ని సమకూర్చి ఈ ఆశ్రమం ఏర్పాటు చేశారు. ఇక్కడ రమణ మహర్షి ప్రధానాలయం, ధ్యాన మందిరం ఈ ఆశ్రమాన్ని ఆనుకొని 2019 మార్చి 6న శ్రీ అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయాన్ని, దక్షిణామూర్తి, గణపతి, కుమార స్వామి ఉపాలయాలను నిర్మించారు. క్రమంగా ఈ ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఆంధ్రా అరుణాచలంగా తీర్చిదిద్దారు. తొలుత స్థానికులు మాత్రమే ఈ క్షేత్ర దర్శనానికి వచ్చేవారు. అనతి కాలంలోనే పరిసర మండలాలు, జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల వారు సైతం ఈ క్షేత్ర దర్శనానికి వస్తున్నారు. ఈ సుప్రసిద్ధ ఆలయంలోని మండపంలో ఈ నెల 7న మహా శివభక్తులైన 63 నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వీరితో పాటు ఉపాలయంలో దక్షిణామూర్తి, లక్ష్మీ హయగ్రీవుడు, సూర్య భగవానుడు, కాలభైరవుడు, గంగా మాత విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నారు.

ప్రతిష్ఠామహోత్సవాలు ఇలా.. : నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు ప్రముఖులు తరలి రానున్నారు. తిరువణ్ణామలై అరుళ్మిగు అరుణాచలేశ్వరస్వామివారి దేవస్థానం అర్చకుడు టి.అరుణాచల కార్తికేయ శివాచార్య ఆధ్వర్యాన నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 4న గోపూజ, గణపతి హోమం, లక్ష్మీ హోమం, నవగ్రహ హోమం నిర్వహిస్తారు. 5న తీర్థ సంగ్రహణం, అగ్నిసంగ్రహణం, దిశాహోమం, శాంతిహోమం, మూర్తి హోమం అనంతరం రక్షోఘ్నం, గ్రామ శాంతి, ప్రవేశ బలి, 6న స్వామి అనుజ్ఞ, అంకురార్పణ, యాగశాల నిర్మాణం, అశ్వపూజ జరుగుతాయి. 7న నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. అనంతరం కుంభాభిషేకం నిర్వహిస్తారు. ఈ వేడుకకు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ, కృష్ణా జిల్లా పెదపులిపాక విజయ రాజేశ్వరి దేవస్థానం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామీజీతో పాటు పలువురు ఆధ్యాత్మికవేత్తలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు రాజకీయ ప్రముఖులు, భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

విజయవంతం చేయాలి



ఆంధ్రా అరుణాచల క్షేత్రంలో ఈ నెల 7న నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభోపేతంగా జరుగుతుంది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. వారికి, ప్రముఖులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని భక్తులు విజయవతం చేయాలి.

– స్వామి రామానంద,
శ్రీరమణ సేవాశ్రమం పీఠాధిపతి, రాచపల్లి

క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

తాళ్లపూడి: అన్నదేవపేట పంచాయతీ పరిధి సూరయ్యపేట వైఎస్సార్ కొత్త కాలనీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహం చేతులు, చెవులు, ముక్కు వద్ద పగుల గొట్టారు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని తాళ్లపూడి పోలీసులకు, తహసీల్దార్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిపే రాజు, నూతంగి సురేష్ అన్నారు. దీనిని ఆ పార్టీ నాయకులు పిట్టా శ్రీనివాస్, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, కందికొండ సత్యనారాయణ, ఊటాల నంద, గర్భాపు ఈశ్వరరావు, గొరిపర్తి రాజు, పూరూరి హరి తదితరులు తీవ్రంగా ఖండించారు.

సముద్రంలో బోటు బోల్తా
మత్స్యకారులు సురక్షితం



సముద్రంలో బోల్తా పడిన బోటు

కొత్తపల్లి: సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు కెరటాల ఉధృతికి బోల్తా పడింది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని ఉప్పాడకు చెందిన బొందు మసేను బోటుపై అదే గ్రామానికి చెందిన చేపల అప్పారావు, శ్రీహరిలు సోమవారం తెల్లవారు జామున ఉప్పాడలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లారు. బయలుదేరిన కొద్ది సేపటికే కెరటాల ఉధృతి కారణంగా బోటు బోల్తా పడింది. ఆ ముగ్గురు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. హార్బర్ గట్టుకు బోటు ఢీకొనడంతో ధ్వంసమైంది. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు.

పచ్చిరొట్టతో పచ్చధనం

- మంచి ఫలితాలిస్తున్న సాగు
- రైతుకు అదనపు ఆదాయం
- ఎకరాకు 20 టన్నుల పశుగ్రాసం
- బహుళ ప్రయోజనాలతో ఆనందం



పచ్చిరొట్ట సాగు చేసిన పొలం

పాడి-పంట

పిఠాపురం: అవగాహన ఉంటే సాగులో సిరుల పంటే... కాలానుగుణంగా పంటలు వేస్తే అదనపు ఆదాయమే.. ఒకప్పుడు పచ్చిరొట్ట పంట అంటే ఏముందిలే అనుకునే వారు, ఇప్పుడు అదే అదనపు ఆదాయం తెచ్చే వనరు అయ్యింది. ఏటా రబీ పంట తర్వాత మండు వేసవిలో పొలాలను ఖాళీగా ఉంచే వారు. కానీ ప్రకృతి వ్యవసాయం పెరగడంతో ఎక్కడ చూసినా మండుటెండల్లో కూడా పచ్చని పంట పొలాలు కనిపిస్తున్నాయి. వేసవిలోనూ రైతులకు అదనపు ఆదాయం తెచ్చేలా, పశువులకు మేతగా, భూమికి పోషకాలు అందించే పచ్చిరొట్ట సాగుపై అవగాహన పెరిగింది. బహుళ ప్రయోజనాలు కలిగిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్)- పచ్చిరొట్ట పంటలు సాగు చేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఏటా రబీ పూర్తయిన తర్వాత మే నెల 15 నుంచి జూన్ 30 లోపు ఈ పంటను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ పంట కాలం 45 రోజులు. ఈ ఏడాది పిఠాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో సుమారు 400 ఎకరాల్లో పచ్చిరొట్ట చేశారు. దీని కోసం ఎకరానికి 10 కిలోల చొప్పున ప్రకృతి వ్యవసాయ శాఖ రైతులకు నవధాన్యాల విత్తనాలను అందించింది. ఇటీవల దీనిని రైతులు సాగు చేశారు. మొత్తం 400 ఎకరాల్లో పీఎండీఎస్ విత్తనాలు మరింత సారవంతంగా మొక్కలు రావడంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

అమ్మకం... ఆదాయం

పచ్చిరొట్ట పంట ఏపుగా పెరగడంతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతోంది. పంట బాగా రావడంతో ఎకరానికి సుమారు 20 టన్నుల వరకూ పోషక విలువ ఉన్న పశుగ్రాసం లభ్యమైంది. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ రైతుకు అదనపు ఆదాయం సమకూరుతోంది. వివిధ మిల్క్ డెయిరీలకు చెందిన యజమానులు పచ్చిరొట్ట పశుగ్రాసం కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా రోజూ 200 టన్నులకు పైగా పశుగ్రాసం అమ్మకాలు జరుగుతున్నాయి. ఒకపక్క భూమి సారవంతం కావడంతో పాటు మరోపక్క రైతుకు అదనపు ఆదాయం వస్తుండడంతో పచ్చిరొట్ట సాగుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

సాగు.. లాభాలు బాగు

పచ్చిరొట్ట సాగు చేసిన పంట పొలాల్లో అనూహ్య ఫలితాలు కనిపిస్తున్నాయి. భూసారం పెరగడంతో పాటు రైతుకు మంచి లాభాలను తెచ్చిపెడుతోంది. వీటి సాగుతో కలుపు నివారణ జరుగుతుంది. భూసారం పెరుగుతుంది, భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం అధికమవుతుంది. పురుగులు, తెగుళ్ల నివారణ, రైతు మిత్రులు వానపాముల వృద్ధి జరిగి మిత్ర పురుగుల శాతం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గి ఖర్చు ఆదా అవుతుంది. భూమి కోతకు గురి కాకుండా కాపాడుతూ పంట దిగుబడి బాగుంటుంది. భూతాపం తగ్గి విపత్తులను తట్టుకునే శక్తి వస్తుంది. నేల సేంద్రియ కర్బనం రెండు శాతం వరకూ పెరిగి సూక్ష్మజీవుల వైవిధ్యత పెరిగి అనేక పోషకాలు పైరుకు అందుతాయి. బీడు భూములు సారవంతమవుతాయి. వేసవిలో పశువులకు గ్రాసం అందుతుంది. పంట వేరు వ్యవస్థ పటిష్టంగా పెరిగి, పంట వాతావరణ ఆటుపోట్లను తట్టుకుని నిలబడుతుంది. జీవవైవిధ్యం పెరుగుతుంది. పంట ఉత్పత్తుల నాణ్యత, పోషక విలువలు పెరిగి రైతుకు అదనపు ఆదాయం తెచ్చిపెడుతుంది. 365 రోజులు భూమి కప్పబడి ఉండి సకాల వర్షాలకు దోహదపడుతుంది. ఈ గ్రాసం తీసుకున్న పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుంది. పాలలో వెన్న శాతం అధికమవుతుంది. ఈ విధంగా ఇప్పటికే ఫలితాలు సాధించిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చేబ్రోలులో పచ్చిరొట్ట పంటను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో పంట వివరాలు

పచ్చిరొట్ట సాగు భూములు: 40 వేల ఎకరాలు
పంపిణీ చేసిన విత్తనాలు: 400 టన్నులు
సాగు చేసిన రైతులు: 56 వేల మంది
దిగుబడికి వచ్చిన పశుగ్రాసం: 60 వేల టన్నులు
వచ్చిన ఆదాయం: సుమారు రూ.6 కోట్లు

బాగా ఏపుగా పెరిగి..



నా పొలంలో రబీ అనంతరం పచ్చిరొట్ట సాగు చేశాను. మా పశువులకు మేత అయినా ఉంటుందిలే అనుకున్నాను. తీరా చూస్తే అది బాగా ఏపుగా పెరిగి మంచి పశుగ్రాసం తయారైంది. ఇలా పశువులకు బాగా మేత దొరికింది. ఇంతలో మిల్ డెయిరీల వారు వచ్చి మేత కొనుగోలు చేస్తామన్నారు. నా పొలంలో ఎకరానికి సుమారు 20 టన్నుల మేత వచ్చింది. వారు రూ.20 వేలకు ఎకరం పొలంలో ఉన్న పశుగ్రాసం తీసుకోవడానికి అంగీకరించి తీసుకెళుతున్నారు.

–తుమ్మలపల్లి వెంకటరమణ, రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు



పచ్చిరొట్ట సాగు మంచి ఫలితాలను ఇవ్వడంతో చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. ఇది మంచి పరిణామం. అయితే రైతులు పచ్చిరొట్ట పంటను భూమిలో కలియదున్నకుండా ముందుగా పశుగ్రాసం తీసుకుని మిగిలిన వ్యర్థాలను కలియదున్నుకోవడం ద్వారా ఆదాయం వస్తుంది. మంచి ఫలితాలు భూమికి అందుతాయి. పచ్చిరొట్ట సాగుతో జిల్లాలో పశుగ్రాసం ఒక్కసారిగా పెరిగింది. ఇది పాడి పరిశ్రమకు మంచిది.

–ఎలియాజర్, ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం, కాకినాడ

పోలీసులకు కృతజ్ఞతలు

కాకినాడ క్రైం: ప్రేమ పేరుతో మోసానికి గురైన రాజస్థాన్‌కు చెందిన బాలికను రక్షించి తీసుకువచ్చిన పోలీసులకు ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు, వారు సోమవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన బాలికలను సంరక్షించుకునే విధానాలను వివరించారు. బాలికను ఉన్నత చదువులు చదివించాలంటూ సూచించారు. జూన్ 8న కరప పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనలో స్థానిక యువకుడి చేతిలో రాజస్థాన్‌కి చెందిన 15 ఏళ్ల బాలిక మోసానికి గురైంది. దీనిపై ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టిన పోలీసులు బాలికను శనివారం కర్ణాటక రాష్ట్రంలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

• అలా... ఎగసిపడుతూ...



ఉప్పాడ - కాకినాడ బీచ్ రోడ్డులో రక్షణ గోడను దాటి వస్తున్న అలలు

అలలు ఎగసి పడుతున్నాయి. ఇవి రెండు రోజుల నుంచి ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డును తాకుతున్నాయి. కడలి కల్లోలంగా మారడంతో కెరటాలు ముందుకు దూసుకొస్తున్నాయి. కెరటాల తాకిడికి బీచ్ రోడ్డు కోతకు గురైంది. ఈ రోడ్డులో రక్షణగా వేసిన బండరాళ్ల గోడను సైతం కెరటాలు ఢీకొడుతున్నాయి. దీంతో రాళ్లు రోడ్డుపై పడుతున్నాయి. ఆ దారిలో వెళ్లే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సందర్శకులు సముద్ర తీరానికి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

–కొత్తపల్లి

మత్తులో చెలరేగిపోయారు!

- యువకుల పరస్పర దాడులు
- జాతరలో అశ్లీల నృత్యాలు
- పెద్దాపురం పట్టణంలో ఘటన

పెద్దాపురం: మద్యం, గంజాయి మత్తులో చెలరేగిపోయారు.. రోడ్లపై ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.. కూటమి ప్రభుత్వంలో కొందరి అండతో ఈ తంతు యథేచ్ఛగా సాగిందనడానికి ఆదివారం అర్ధరాత్రి పెద్దాపురం పట్టణంలో జరిగిన ఘటనే నిదర్శనం. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఎంతో భక్తిభావంతో పెద్దాపురం మరిడమ్మ వారి ఆషాఢమాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీధి సంబరాలు జరుగుతుండడం ఆనవాయితీ వస్తోంది. ఇందులో భాగంగా తొలి ఆదివారం స్థానిక దర్గా సెంటర్ చేపల వీధి సంబరం జరిగింది. ఇక్కడ యువతులతో అశ్లీల నృత్యాలు చేయించారు. ఇది పోలీసుల ముందే జరగడం విశేషం. డీజే పేరిట డ్యాన్స్‌లతో హోరెత్తించారు. ఇదిలా ఉంటే ఇక్కడ మద్యం, గంజాయి తాగిన కొందరు యువకులు పరస్పర దాడులకు దిగి భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఆ యువకులు సుమారు మూడు చోట్ల స్టేజీ సమీపంలోనే ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. విచక్షణా రహితంగా కొట్టుకోవడంతో పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ మౌనిక, తన సిబ్బంది వచ్చి వారిని తరిమేయడంతో యువత చెల్లాచెదురయ్యారు. తర్వాత ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న చోటే మళ్లీ రక్తం చిందేలా కొట్టుకున్నారు. పరస్పర దాడులకు దిగారు. ఈ ఘటనల్లో సుమారు 15 మందికి గాయాలు కాగా, మూడు ఘటనలకు సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అశ్లీల నృత్యాల నిర్వహణకు స్థానిక కూటమి నేతల ఒత్తిళ్లే కారణమని, అందుకే పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎటువంటి కేసూ నమోదు కాకపోవడం గమనార్హం.



మద్యం మత్తులో ఘర్షణ పడుతున్న యువకులు

మద్యం మత్తులోనే ఘర్షణ

స్థానిక చేపల వీధి సంబరంలో తగదా పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. సంబరాన్ని తిలకించేందుకు వచ్చిన ఇరువురి మధ్య జరిగిన వాగ్వాదం చినికి చినికి గాలివానలా మారి ఘర్షణ చోటుచేసుకుందన్నారు. ఇరువురూ మద్యం మత్తులో ఉన్నారని, సోషల్ మీడియాలో వాటిని వక్రీకరిస్తూ గంజాయి మత్తు అంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. ఆ వార్తల్లో వాస్తవం లేదని, కేవలం మద్యం మత్తులో మాత్రమే వారు తీవ్రంగా గాయపర్చుకున్నారన్నారు. పెద్దాపురానికి చెందిన బాలుడు, రాజమహేంద్రవరం సీతంపేట ఎన్టీఆర్ కాలనీకి చెందిన చుక్కా దుర్గారావును అదుపులోకి తీసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీధి సంబరాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో సీఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

రైలులో బ్యాగ్ చోరీ

సామర్లకోట: ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగీలో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి బ్యాగ్ చోరీ జరిగింది. పిఠాపురం వెళ్లాల్సిన దోడవి మహావీర్ సామర్లకోటలో రైలు దిగాడు. అయితే బోగీ నుంచి సోమవారం తెల్లవారు జామున దిగే సమయంలో బ్యాగ్ కనిపించ లేదని సామర్లకోట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశానే. బ్యాగ్‌లో రూ.35 వేలు, ఆధార్, పాన్, ఓటరు, ఏటీఎం కార్డులతో పాటు సెల్ ఫోన్ ఉందని పేర్కొన్నారు. మహావీర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యుద్ధ ట్యాంకర్.. అదుర్స్



ఇదిగో డమ్మీ యుద్ధ ట్యాంకర్

- తయారు చేసిన గ్రామీణ యువకుడు
- ఆర్మీపై ఉన్న ఆసక్తితో రూపకల్పన



నాగేంద్ర

కొత్తపల్లి: ఈ చిత్రం చూశారా.. యుద్ధ ట్యాంకర్ ఇలా పల్లెల్లోకి వచ్చిందనుకుంటున్నారా..! అవును నిజమేనండి. కానీ డమ్మీ యుద్ధ ట్యాంకర్. ఓ యువకుడి నైపుణ్యం నుంచి ఇలా రూపుదిద్దుకుంది. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలనే దృఢసంకల్పం ఇలా ఆర్మీ పరికరాలను తయారు చేసేలా ఆలోచన రేకెత్తించింది. కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన పంపన నాగేంద్ర ఈ డమ్మీ యుద్ధ ట్యాంకర్ రూపశిల్పి. ఇతను ఐటీఐ ఫిట్టర్ చదివాడు. ప్రస్తుతం కాకినాడలోనే డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దేశానికి రక్షణ కవచంలా ఉన్న ఆర్మీలో చేరడం అంటే ఇతనికి ఎంతో ఇష్టం. వారు ఉపయోగించే పరికరాలంటే ఎంతో మక్కువ. అదే ఈ ట్యాంకర్ తయారీకి ఉపయోగపడింది. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ డమ్మీ ట్యాంకర్‌ను తయారు చేసినట్లు నాగేంద్ర చెబుతున్నాడు. దీనికి సుమారు రూ.1.80 లక్షల ఖర్చు అయ్యిందని చెప్పాడు. ట్రాక్టర్, ఆటో, మోటారు సైకిళ్లలోని పలు పరికరాలు, ఇనుప రేకులు, సీలింగ్ తయారు చేసే షీట్లు, విద్యుత్ పరికరాలు ఉపయోగించినట్లు వివరించాడు. సుమారు 45 రోజులు శ్రమించి ఈ ట్యాంకర్‌ను తయారు చేసినట్లు చెబుతున్నాడు. దీని నుంచి ప్రతి 5 సెకన్లకు ఒక తూటా పేలుతుంది. ఇలా ఆరు తూటాలు వస్తాయి. తూటా సుమారు 600 మీటర్ల వరకూ వెళుతుంది. ఈ తూటాలు పేలేందుకు మందుగుండు సామగ్రిని ఉపయోగించాడు. ఆర్మీలో చేరి పరికరాలు తయారు చేయాలన్నదే తన లక్ష్యమని నాగేంద్ర వివరించాడు. ఇప్పటికే ఆర్మీలో ఉపయోగించే ఏకే 47 గన్‌తో పాటు పలు గన్‌లు, మినీ యుద్ధ ట్యాంకులు, పలు కాలేజీల నమూనాలు తయారు చేశానన్నారు. ఈ డమ్మీ యుద్ధ ట్యాంకును కాకినాడ లైట్ హౌస్ బీచ్ వద్ద ప్రదర్శనకు ఉంచామన్నారు.

నేడు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం

ధవళేశ్వరం: గోదావరి వరదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ కార్యాలయంలో మంగళవారం ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు. అక్టోబర్ 31వ తేదీ వరకు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని వెల్లడించారు. వరదలకు సంబంధించిన సమాచారాన్ని ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0883-2417066కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

గంగలకుర్రులో అగ్ని ప్రమాదం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో రూ. 5 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బాధితుల కథనం ప్రకారం.. షేక్ సుర్జహాన్ సాహెబ్‌కు చెందిన డాబాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలతో పాటు, ఏసీ, ఫ్రిజ్, టేకు మంచం, దుస్తులు కాలిపోయాయి, అలాగే ఐదు కాసుల బంగారం, 25 తులాల వెండి, పలు సర్టిఫికెట్‌లతో పాటు ధ్రువీకరణ పత్రాలు బూడిదయ్యాయి. ఈ ఘటనా స్థలానికి అమలాపురం అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు. బాధితులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, విత్తనాల ఇంద్రశేఖర్, మట్టపర్తి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ మౌనిక, వీఆర్వో నాగలక్ష్మి ఓదార్చారు.

జి.అగ్రహారంలోని ఓ ఇంట్లో కాలిపోయిన సామగ్రి →

